సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



మహిళ దారుణ హత్య

కడపలో మహిళ దారుణ హత్యకు గురైంది. ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తే చంపేశాడు.

-8లో..



వెల్లివిరిసిన మత సామరస్యం

వినాయకుడి లడ్డూలను వేలం పాటలో ముస్లిం యువకులు దక్కించుకుని హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు.

-8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.130
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 431 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	448	555
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 562.180 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడి యథావిధిగా స్పందన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. అధికారులు, స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

26న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: అండర్ -14 బాల,బాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలు మదనపల్లె బీటీ కాలేజీ మైదానంలో ఈ నెల 26న జరుగుతాయని అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వసంత, విజయకుమారి, సురేష్‌బాబులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అండర్-14,17 నెట్‌బాల్ బాల,బాలికల జిల్లా జట్టు ఎంపికలు ఈనెల 29న మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని వారు తెలిపారు. క్రీడాకారులు గుర్తింపుపత్రాలతో హాజరయ్యేలా చూడాలని వ్యాయామోపాధ్యాయులను వారు కోరారు.

హార్సిలీహిల్స్‌పై 30న మహాజన సభ

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభ ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బి.సోమశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హార్సిలీహిల్స్‌పై నున్న సొసైటీ కార్యాలయ భవనంలో నిర్వహించే మహాజన సభకు సొసైటీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. సభలో ఏడాదికి సంబంధించిన బడ్జెట్, ఆర్థిక వ్యవహారాలు, ఆదాయ, వ్యయాల లెక్కలను సభ్యులకు తెలియపర్చాలి. ఆర్థికపరమైన అన్ని అంశాలను బహిర్గతం చేయాలి. ఆజెండా అంశాలను తయారుచేసి సభ్యులకు తెలియపర్చాక ఆమోదం పొందాల్సి ఉంటుంది. అలాగే మార్చిలో సాధారణ సభను నిర్వహిస్తారని చెప్పారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగర పరిధిలోని శ్రీఅన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పురుషుల సీనియర్ విభాగం ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా బాస్కెట్‌బాల్ వ్యవస్థాపక కార్యదర్శి సి. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే 9వ సీనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వర్షం కారణంగా మహిళల జట్టు ఎంపికలను ఈనెల 25వ తేదీన కడప నగరంలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

హాకీ మైదానం పరిశీలన



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు

పులివెందుల టౌన్: పట్టణంలోని వైఎస్ఆర్ క్రీడా మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకీ క్రీడా మైదానాన్ని హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు, కార్యదర్శి హర్షవర్ధన్ పరిశీలించారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ 19వ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం స్థానిక విజయగార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే హాకీ పోటీల నిర్వహణ క్యాలెండర్లు, క్రీడా రిజిస్ట్రేషన్, కొత్త జిల్లాల ఎన్నికలు, వివిధ అంశాలపై బోర్డు సభ్యులతో చర్చించారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించి అంతర్జాతీయ హాకీ పోటీల నిర్వహణ, క్రీడాకారుల వసతి భవనాలను పరిశీలించి, ఈ నివేదికను హాకీ ఇండియా వారికి పంపనున్నట్లు తెలిపారు. పులివెందుల ప్రాంతంలో అత్యున్నత ప్రమాణాలతో హాకీ క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, కోశాధికారి థామస్, కడప సభ్యులు శ్రీనివాసులు, పులివెందుల శేఖర్, వివిధ జిల్లాల హాకీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు, పులివెందుల హాకీ పోషకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం

- ఈనెల 15 నుంచి కొనసాగుతున్న సర్వే
- ఇంటింటికి తిరుగుతున్న వలంటీర్, ఏఎన్ఎం, సీహెచ్ఓ
- 30న గ్రామ, వార్డు సచివాలయాల్లో వైద్య శిబిరాలు
- పట్టణ ప్రాంతాల్లో 56, గ్రామీణ ప్రాంతాల్లో 26 శాతం సర్వే పూర్తి



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు, వైద్య సిబ్బంది



సాక్షి రాయచోటి : ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని భావిస్తోంది ప్రభుత్వం. అందుకే అందరికీ ప్రత్యేక పరీక్షలతో ఉత్తమ వైద్యం అందించేందుకు జగన్ సర్కార్ పథక రచన చేసింది. వ్యాధి ఏదైనా అందుకు తగ్గట్టుగా పెద్దాస్పత్రులలో అత్యుత్తమ వైద్యాన్ని అందించేలా కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తూ ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ల ఖర్చు భరిస్తూ మరోవైపు ఉద్యోగులకు హెల్త్‌కార్డుల ద్వారా ఆస్పత్రి ఖర్చులను అందిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు చేసి ఉత్తమ వైద్యానికి శ్రీకారం చుట్టారు.

ముమ్మరంగా సర్వే

అన్నమయ్య జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళుతూ ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. పట్టణ ప్రాంతాల పరిధిలో సుమారు 25,192 గృహాలకు 16,354 గృహాల్లో సర్వే ఇప్పటికే పూర్తి చేసి 56 శాతం సాధించారు. గ్రామీణ ప్రాంతాల పరిధిలో 2,23,915 గృహాలకు 49,681 గృహాలను సర్వేతో 25 శాతం పూర్తి చేశారు. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా సర్వేలో మూడో స్థానంలో కొనసాగుతోంది.

వివిధ వ్యాధులకు పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎక్కడికక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వలంటీర్, ఏఎన్ఎం, సీహెచ్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సంబంధించి బీపీ, షుగర్, క్షయ, డెంగీ, మలేరియా, యూరిన్‌తోపాటు దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను సేకరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతోపాటు ఇతర వ్యాధులున్న వారిని కూడా అప్రమత్తం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలతో నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని సూచిస్తున్నారు.

ఈనెల 30 నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇప్పటికే సర్వే చేసిన ఇళ్ల పరిధిలోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సంబంధించి ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు నెలాఖరు వరకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, స్థానిక వైద్యులు సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి ప్రత్యేక ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. అత్యుత్తమ వైద్యం అందించేలా ప్రత్యేక కృషి జరగనుంది.

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇప్పటివరకు చేసిన పరీక్షల వివరాలు

బీపీ	1,03,377
షుగర్	89,106
రక్త పరీక్షలు	1,06,439
మూత్ర పరీక్షలు	3887
మలేరియా	3473
డెంగీ	2762





జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు తెలియజేస్తున్న వైద్య సిబ్బంది, వలంటీర్లు

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజల అనారోగ్య సమస్యలకు సంబంధించి ఇప్పటికే సిబ్బంది సర్వే చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా అత్యుత్తమ వైద్యం అందించేందుకు పథక రచన చేసింది. డెంగీ, మలేరియాతోపాటు ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వాసులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు తరలి రావాలి.

– డాక్టర్ కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఆరోగ్యమే ధ్యేయంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గ్రామాల పరిధిలో వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. స్పెషలిస్టు వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి పెద్దాస్పత్రుల్లో చికిత్సలు అందిస్తారు. ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకుండా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

వైభవం..పవిత్రోత్సవం



కలశాన్ని తీసుకెళుతున్న అర్చకులు

నందలూరు (రాజంపేట): నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో తిరుమల-తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగురోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆలయ అర్చకులు సునీల్ శర్మ తెలిపారు.ఆదివారం అర్చకులు కలశాన్ని ఆలయంలోకి తీసుకొచ్చారు. ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి ప్రభాకర్, కాకి చంద్ర, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీపీఎస్సీలోని వివిధ నోటిఫికేషన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకు, అలాగే అక్టోబరు 3 నుంచి 6వ తేదీ వరకు ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 8 నుంచి 9 వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2 వరకు మాత్రమే అనుమతించాలని సూచించారు. కోవిడ్ నిబంధనల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చూడాలన్నారు. లైజన్ అధికారులు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి సజావుగా సాగేలా చూడాలన్నారు.

మానస సరోవరంలో ఇక విహారం

బోటింగ్‌కు అటవీశాఖ ఏర్పాట్లు



విహారానికి తెప్పించిన బోట్లు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మానస సరోవరంలో సందర్శకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బోటింగ్ విహారానికి రంగం సిద్ధమైంది. అటవీశాఖ అభివృద్ధి చర్యల్లో భాగంగా ఘాట్‌రోడ్డు పక్కనున్న గంగోత్రి చెరువు, కొండపైనున్న మానస సరోవరంలో పర్యాటకుల కోసం బోటింగ్ ప్రారంభించాలని చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై సత్వర చర్యలు చేపట్టిన డీఎఫ్‌ఓ పళణి వివేక్ (రాజంపేట) బోటింగ్ సామగ్రిని హార్సిలీహిల్స్‌కు తెప్పించారు. మానస సరోవరంలో పెద్దలు, పిల్లలకు రెండు పెడల్ బోట్లు కొనుగోలు చేశారు. వీటిని కొండపైకి తరలించగా, వాటిని ఉపయోగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బోటింగ్‌కు వెళ్లే సందర్శకులకు లైఫ్ జాకెట్లను కూడా సిద్ధం చేశారు. వారంరోజుల్లో మానస సరోవరంలో బోటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ఆదివారం తెలిపారు. దీనికోసం ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. సందర్శకుల భద్రత కోసం చర్యలు తీసుకుంటామన్నారు. గంగోత్రి వద్ద ఫెన్సింగ్‌తోపాటు వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు బోటింగ్ కోసం సందర్శకుల నుంచి నామమాత్రపు రుసుము వసూలు చేస్తామని వివరించారు.

శిల్పారామంలో టూరిజం ప్రాంతాల షో

కడప కల్చరల్: ఈ నెల 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప శిల్పారామంలో జిల్లా పర్యాటక ప్రాంతాల ప్రత్యేక షోను నిర్వహించారు. ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి రూపొందించిన ఈ ప్రదర్శనను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిల్పారామం సందర్శకులకు ప్రదర్శించారు. ఇందులో జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు, ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, జిల్లా ప్రముఖులు, చరిత్ర, శాసనాలు, నదులు, ఇతర విశేషాలతో కూడిన ఫొటోలు, వాటి గురించిన వివరాలను తెలియజేశారు. కార్యక్రమాన్ని శిల్పారామం రాష్ట్ర ఏఓ మునిరాజు, కడప శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

పల్లె పాలనను పరుగెత్తించాలి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

కురబలకోట: ఇంటిని ఇల్లాలు ఎలా చక్కదిద్దుతుందో గ్రామ కార్యదర్శులు కూడా బాధ్యతగా పనిచేసి పల్లె పాలనను పరుగులెత్తించాలని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శులకు అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో నాలుగు విడతలుగా ఆగస్టు 29న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ అనేది మనిషిని రాటుదేలుస్తుందన్నారు. నిపుణుడిగా తయారు చేస్తుందన్నారు. అంతేగాకుండా మెరుగైన సేవలు, చక్కటి పాలనకు పూర్తి అవగాహన అవసరమన్నారు. జిల్లాలో 30 మండలాలకు చెందిన 431 మంది గ్రామ గ్రామ కార్యదర్శులకు విడతల వారీగా వివిధ అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు, బాధ్యతలు, నిధులు, విధులు, నిబంధనలు, వనరుల సమీకరణ, లే అవుట్లు, భవన నిర్మాణాలు, పన్నులు వసూళ్లు, పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి సమన్వయంతో నడవాలన్నారు. ప్రజలు సంతృప్తి పడేలా సేవలు అందిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మదనపల్లె, రాజంపేట డీఎల్‌పీఓలు నాగరాజు, పార్వతి, మాస్టర్ ట్రైనర్స్, గోల్డన్‌వ్యాలీ కళాశాల అధినేత ఎన్వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

రైతుల చూపు.. పండ్లతోటల వైపు

- జిల్లాలో 5266 ఎకరాల్లో సాగు
- 2735 మందికి ఉపాధి ద్వారా లబ్ధి
- రైతులకు వందశాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం



ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

పీలేరు రూరల్: సన్న, చిన్నకారు రైతులకు ఆదాయ మార్గాలను సమకూర్చడం... జీవనోపాధులకు భద్రత కల్పించడం.. ఉత్పాదక ఆస్తులను పెంపొందించడం.. కరువుపీడిత ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, శాశ్వత ప్రాతిపదిక భూ అభివృద్ధి, భూసార రక్షణ లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన పండ్ల తోటల పెంపకం జిల్లాలో లక్ష్యాన్ని అధిగమించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2735 మంది రైతులకు లబ్ధి కలిగింది.

- జిల్లాలో 5050 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం కాగా 5266 ఎకరాల్లో సాగు చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు డ్వామా పీడీ ఎంసీ మద్దిలేటి తెలిపారు. లబ్ధిదారులు ఇప్పటికే 85 శాతం మొక్కలు నాటడం పూర్తయిందని, వర్షాలు కురిస్తే వందశాతం పూర్తి చేస్తామని చెప్పారు.

ప్రభుత్వం ద్వారా సహకారం...

ఎంపిక చేసిన రైతులకు పండ్లతోటల పెంపకం, 3 సంవత్సరాల వరకు వంద శాతం నిర్వహణ వ్యయం ప్రభుత్వం చెల్లిస్తుంది. భూమి దున్నేందుకు, గుంతలు తీసేందుకు, ముళ్ల కంచెల ఏర్పాటుకు, సేంద్రియ, రసాయన ఎరువులు, సస్యరక్షణ మందులకు, పాదుల్లో కలుపు తీసేందుకు, అంతర్‌పంటలకు, 30 శాతం డ్రిప్ పరికరాల ఏర్పాటుకు, మామిడి తోటల పెంపకానికి ఏడాదికి 20 పర్యాయములు నీరు పోయుటకు బిల్లులు మంజూరు అవుతాయి.

పండ్ల తోటల పెంపకానికి ఎకరాకు నిర్వహణ ఖర్చు....

మామిడికి రూ.10,31,193, చీని రూ. 1,07,459, నిమ్మ రూ. 1,41,515, జామ రూ. 1,27,451, తైవాన్ జామ, రూ. 2,26,783, సపోట రూ. 90,027, కొబ్బరి రూ. 90,610, సీతాఫలం రూ. 59,217, సీతాఫలం (బ్లాక్) రూ. 1,82,840, దానిమ్మ రూ. 2,44,819, నేరేడు రూ. 41,292, చింత రూ. 66,500, ఆపిల్‌రేగు రూ. 1,08,338, 5 లేయర్స్ బహళ పంట రూ. 1,64,863, డ్రాగన్ ఫ్రూట్ రూ. 1,84,533, గులాబీ పూల తోట రూ. 10,795, మల్లెపూట తోట రూ. రూ. 10,295 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది.

నియోజకవర్గాల వారీగా పండ్ల తోటల పెంపకం

నియోజకవర్గం	ఎకరాలు
పీలేరు	1357
మదనపల్లె	400
తంబళ్లపల్లె	1100
రాయచోటి	1059
రాజంపేట	500
రైల్వేకోడూరు	850

85 శాతం మొక్కలు నాటడం పూర్తి



ఈ ఆర్థిక సంవత్సర పండ్ల తోటల పెంపకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 85 శాతం మొక్కలు నాటడం పూర్తి చేశాం. వర్షాభావ పరిస్థితులతో ఇంకా కొన్ని ప్రాంతాల్లో పూర్తి కాలేదు. వర్షాలు కురిస్తే వందశాతం పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం. లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించడం జరుగుతోంది.

– ఎం.సి. మద్దిలేటి, డ్వామా పీడీ.

వందశాతం రాయితీ లభిస్తోంది...



ఉపాధి హామీ పథకంలో 16 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవడానికి రైతులకు వందశాతం రాయితీ లభిస్తోంది. వివిధ రకాల పండ్ల తోటలతోపాటు పూల తోటలు పెంపకాన్ని ప్రోత్సహిస్తూ సకాలంలో బిల్లులు ఇస్తున్నాం. అంతర్‌పంటలకు కూడా బిల్లులు ఇవ్వడం జరుగుతోంది. గట్లపై టేకు, ఎర్రచందనం లాంటి మొక్కలు నాటుకోవడానికి బిల్లులు మంజూరవుతున్నాయి.

– ఎస్. మధుబాబు, ఏపీడీ, కలికిరి

ఉపాధి హామీతో ఎంతో ప్రయోజనం



ఉపాధి హామీ పథకంతో ఎంతో ప్రయోజనం పొందాం. ఆర్థిక స్తోమత లేక నాకున్న పొలం మొత్తం ఖాళీగా పెట్టుకున్నాం. అయితే ఉపాధి హామీ పథకంతో నా రెండు ఎకరాల్లో 150 మామిడి మొక్కలు నాటా. అందుకు సంబంధించి బిల్లులు మొత్తం నా ఖాతాకు జమ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– బి.డి. సిద్దారెడ్డి, రైతు రామిరెడ్డిగారిపల్లె, పీలేరు మండలం.

బిల్లులు చెల్లించారు



ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేసుకోవడానికి బిల్లులు అందించడం తోపాటు అధికారులు సలహాలు కూడా ఇస్తున్నారు. రెండు ఎకరాల పొలంలో మామిడి మొక్కలు నాటా. ఇప్పటి వరకు బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించారు. మా లాంటి పేద వారికి ప్రభుత్వం ఎంతో మేలు చేసింది.

– జి. శ్రీధర్‌నాయుడు, భయ్యారెడ్డిగారిపల్లె, పీలేరు మంలం

1న రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (అమరావతి) 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో జరగనుందని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.జీవన్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కడప నగరం పాత కలెక్టరేట్ వద్దగల రెవెన్యూ హోంలో నిర్వహించిన ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రత్యేక అతిథిగా సీసీఎల్‌ఏ సాయిప్రసాద్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి తదితరులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి జిల్లాకు సంబంధించిన సభ్యులందరూ హాజరు కావాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర కౌన్సిల్‌లో నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ నెల 30వ తేది రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్రయ కమిటీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అందరూ సన్నద్ధతతో ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి అలీఖాన్, కోశాధికారి రొనాల్డ్, తహసీల్దార్లు గంగయ్య, ఇక్బాల్‌బాషా, శంకర్, ఉదయభాస్కర్‌రాజు, శరత్, నరసింహప్రసాద్, కుమార్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీతోపాటు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివి ఉండాలని, 18-26 సంవత్సరాలమధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంపదించాలన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



చోరీ జరిగిన వినాయకుని ఆలయం

నందలూరు (రాజంపేట): నందలూరు రైల్వే కేంద్రంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం గుండా తాళం విరగకొట్టి దొంగలు హుండీలో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం యథావిధిగా ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన పూజారి సరసా రవికుమార్ శర్మ ప్రధాన ద్వారంతోపాటు గర్భగుడి ద్వారాల తాళాలను విరగకొట్టిన విషయాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పక్కనే ఉన్న హజరత్ ఖాదర్ వలీ దర్గాలో దొంగలు హుండీలోని నగదును దోచుకెళ్లారు. ఈ విషయాన్ని దర్గా కమిటీ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జాకీర్ రెండు ఆలయాల పరిసరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిలో మునిగిన బాలుడిని కాపాడిన పోలీసులు



శివను కాపాడిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

చిన్నమండెం : రాయచోటి పట్టణం జగదాంబ సెంటర్ ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల గుల్బర్గా శివ అనే బాలుడు శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో మునిగిపోతుండగా కాపాడినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాల నుంచి వినాయక ప్రతిమలను శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గుల్బర్గా శివ నిమజ్జనం అనంతరం లోతుగా ఉండే ప్రదేశంలోకి వెళ్లి ఇరుక్కుపోయాడు. గమనించిన పోలీసులతో పాటు రాయచోటి అగ్నిమాపక సిబ్బంది వెంటనే శివను ఒడ్డుకు తీసుకువచ్చి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు అప్పగించారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

వినాయకుడి లడ్డును దక్కించుకున్న ముస్లిం యువకులు



చిట్వేలి:లడ్డును తీసుకెళుతున్న జావిద్



లక్కిరెడ్డిపల్లిలో షేక్ పెద్దఖాదర్ వలికి లడ్డును అందజేస్తున్న సినీ హీరో పీలం భరత్ యాదవ్



రాయచోటి: రూ.2 లక్షలకు లడ్డు దక్కించుకున్న కొండూరు మనోహర్‌రాజు



చిన్నమండెం: రూ.2.50 లక్షలతో లడ్డును దక్కించుకున్న ఓర్సు రెడ్డెప్ప

చిట్వేలి/రాయచోటి: చిట్వేలిలోని వినాయకుడి మంటపం వద్ద ఉంచిన లడ్డుకు ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన వేలం పాటలో షేక్ జావిద్ రూ. 32 వేలకు వినాయకుని లడ్డును దక్కించుకొని హిందూ ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలిచాడు. వినాయక చవితి సందర్భంగా స్థానిక సత్తెమ్మ వీధి యువకులు వైఎస్సార్ సర్కిల్ వద్ద మంటపం ఏర్పాటు చేసి విగ్రహాన్ని ప్రతిష్టించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా లడ్డు వేలంపాట, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా షేక్ జావిద్ రూ. 32 వేలకు లడ్డును కైవసం చేసుకున్నాడు. చిట్వేలి మండలంలో అటు హిందూ పర్వదినాలు, ఇటు ముస్లిం పండుగలను ఐకమత్యంగా అందరూ కలిసి మెలిసి చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మధ్యాహ్నం ఆనందాల రవికుమార్ అన్నదానం చేశారు. సాయంత్రం స్థానిక యల్లమరాజు చెరువులో వినాయకుని ప్రతిమను నిమజ్జనం చేశారు.

లక్కిరెడ్డిపల్లి మండలంలో..

లక్కిరెడ్డిపల్లి మండలం, కాకుళవారం గ్రామం, మునిరెడ్డిగారిపల్లిలో గణపతి లడ్డు వేలం పాటలో అదే గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు షేక్ పెద్దఖాదర్ వలీ రూ. 27వేలకు లడ్డును దక్కించుకున్నాడు. సినీ హీరో పీలం భరత్ యాదవ్ ఈ లడ్డును వలీకి అందజేశారు.

కాగా, రాయచోటి పట్టణంలోని శ్రీ వెన్‌నెస్ట్ విల్లాస్‌లో రూ. 2 లక్షల 2వేలకు కొండూరు మనోహర్ రాజు, మేఘ శ్యామ్‌లు వినాయకుని లడ్డును దక్కించుకున్నారు.

రూ.2.50 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ శ్రీనివాసపురంలో వినాయక ప్రతిమ వద్ద వేలం పాటలో ఓర్సు రెడ్డెప్ప రూ.2.50 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు.

కడప రూరల్ సర్కిల్ కార్యాలయంలో
కానిస్టేబుల్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదనే కారణం
- ఫిర్యాదులో పేర్కొన్న మృతుని భార్య భానుశ్రీ



విజయ్ రాముడు (ఫైల్)

చింతకొమ్మదిన్నె/కడప అర్బన్ : చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పైభాగాన ఉన్న కడప రూరల్ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విజయ్ రాముడు (39)(పీసీ నంబర్:2876) ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భానుశ్రీ ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. 2011 బ్యాచ్‌కు చెందిన విజయ్‌రాముడు జిల్లాలోని పలు పోలీ స్టేషన్‌లలో పనిచేశాడు. కడపలోని అక్కాయపల్లిలో నివాసం ఉండేవాడు. చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై కడప రూరల్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో పని చేస్తుండగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ సమయంలో ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నాడు. తరువాత సస్పెన్షన్ ఎత్తివేయగా విధుల్లో చేరాడు. అంతేగాక అతని తండ్రి అయోధ్యరాముడు తాను సంపాదించిన స్థిరాస్తులను తన కుమారుడికి ఇవ్వకుండా, కుమార్తెలకే ఇచ్చాడు. తద్వారా కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడి, తీవ్ర మానసిక ఆవేదనకు గురయ్యాడు. ఇతనికి భార్య భానుశ్రీ, కుమారుడు హర్షిత్ ఉన్నారు. ఆర్థిక సమస్యలు, మానసిక వేదనతో ఈ చర్యకు పాల్పడ్డాడని మృతుని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన శనివారం సాయంత్రం సెల్‌ఫోన్, పర్సు, తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను అన్నీ ఇంట్లోనే ఉంచేసి విధులకు వెళ్లిపోయాడు. ఉదయం ఎంతసేపటికి ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ ఇంటిలోనే ఉంచి వెళ్లిపోవడంతో అతని భార్య హుటాహుటిన తన భర్త పనిచేస్తున్న కడప రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ ఓ మూలన ఉన్న గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి వేలాడుతున్నాడు. అతని భార్య బోరున విలపిస్తూ పోలీస్‌స్టేషన్ వారి సహకారంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాని అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతకొమ్మదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు.

ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చిదానంద గౌడ్ మృతి



రాజంపేట : ఈడిగ కార్పొరేషన్ సంస్థ డైరెక్టర్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నేత, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి దాసరి చిదానందగౌడ్ (52) ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం ఈడిగపల్లెలోని స్వగృహానికి తరలించారు. గత కొద్దిరోజులుగా తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన భౌతిక కాయానికి సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సంబంధీకులు తెలిపారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. పెద్దకుమార్తె దాసరి మౌనిక రాజంపేట మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా ఉన్నారు.

చిదానందగౌడ్ మృతి తీరని లోటు : మేడా, ఆకేపాటి

రాష్ట్ర బీసీ నాయకుడు చిదానందగౌడ్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటు అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్‌చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కృష్ణారావు, రాజంపేట మండల జేసీఎస్ కన్వీనర్ గంగిరెడ్డి, ప్రాంతీయ వైద్యశాల డైరెక్టర్లు ఉమా, వడ్డె శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, నాయకులు మనుబోలు వెంకటసుబ్బయ్య, రామస్వామి రెడ్డి, మధుసూదనరెడ్డి, మురళీచారి, హిమగిరియాదవ్, మైనార్టీ నేత ఖాజా మొహిద్దీన్, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, పోలి వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌శెట్టి తదితరులు కూడా నివాళులర్పించారు.

తాళ్ల సుబ్బన్న కాలనీలో చోరీ

మదనపల్లె : పట్టణశివారు తాళ్లసుబ్బన్నకాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.5లక్షలు విలువచేసే నగలు, విలువైన వస్తువులు దొంగిలించుకుని వెళ్లిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. కొత్త ఇండ్లు పంచాయతీ తాళ్లసుబ్బన్నకాలనీకి చెందిన తాళ్ల హిమగిరి వ్యాపారరీత్యా బెంగళూరులో ఉంటున్నారు. ఆయన తండ్రి శ్రీనివాసులు మదనపల్లెలోని ఇంట్లో ఉంటున్నారు. మూడురోజుల క్రితం బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంట్లో మూడురోజులుగా ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి రూ.5లక్షలు విలువచేసే నగలు, వెండి వస్తువులను తీసుకెళ్లిపోయారు. ఆదివారం చుట్టుపక్కలవారు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి హిమగిరికి ఫోన్‌చేసి చెప్పడంతో బెంగళూరు నుంచి వచ్చి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఎంపీ అవినాష్ రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న భానుప్రసాద్

పెనగలూరు: ఓబిలి హరిజనవాడకు చెందిన భాను ప్రసాద్ అనే బాలుడికి లక్ష రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం అందజేశారు. పెనగలూరు మండలం, ఓబిలి హరిజనవాడకు చెందిన కాల్వ భానుప్రసాద్‌కు రెండు కిడ్నీలు పాడై తిరుపతిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు.

ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి పులివెందులకు వచ్చిన సందర్భంగా భాను ప్రసాద్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ విషయంపై కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు కూడా సీఎంకు విన్నవించారు. దీంతో లక్ష రూపాయలు మంజూరు చేయడంతో వేంపల్లి టీటీడీ కల్యాణ మండపంలో ఎంపీ చెక్కును బాధితుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో తిప్పన నాగభూషణం, బాధితుని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో విషాదం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో నీటి గుంతలో పడి చిన్న (30) అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో గల రజక కాలనీకి చెందిన గంగులయ్య కుమారుడు చిన్న వినాయక నిమజ్జనానికి తోటి వారితో కలసి ఆదివారం రాత్రి పెన్నానదికి వచ్చాడు. విగ్రహం నిమజ్జనం అనంతరం స్నానం చేసేందుకు నదిలోకి దిగి గుంతలో పడి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సమస్యలతో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటనలు ఆదివారం జరిగాయి. మదనపల్లె మండలం బండకిందపల్లెకు చెందిన షకీలా(35)ను కుటుంబ విషయాలపై తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన పవిత్ర(30) కుటుంబ సమస్యలతో ఇంట్లో వివిధ రకాల మాత్రలను మింగి ఆత్మహత్యకు యత్నించింది. ములకలచెరువుకు చెందిన మైనర్ యువతి తిరుపతిలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. వినాయక చవితి పండుగకు ఇంటికి వచ్చిన ఆమె ఆదివారం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించి అపస్మారకస్థితికి చేరుకుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కడపలో మహిళ దారుణ హత్య

- సహజీవనం చేసిన వ్యక్తే కాలయముడు
- సంఘటన జరిగిన 24 గంటల తరువాత వెలుగులోకి...
- పోలీసుల అదుపులో నిందితుడు



తాటిచెర్ల లక్ష్మి (ఫైల్)



లక్ష్మి మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న తాటిచెర్ల లక్ష్మి(45) అనే మహిళను ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తే కాలయముడిగా మారి రోకలిబండతో తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటన జరిగిన ఒకటిన్నర రోజు తరువాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నచౌక్ పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ముద్దనూరుకు చెందిన తాటిచెర్ల లక్ష్మికి, నారాయణ స్వామికి నవీన, సస్మిత అనే ఇద్దరు కుమార్తెలు సంతానం. నారాయణ స్వామి అనారోగ్యంతో కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయాడు. తాటిచెర్ల లక్ష్మి, తన ఇద్దరు కుమార్తెలకు మూడేళ్ల క్రితం ఒకరికి, తరువాత ఇటీవల రెండవ కుమార్తెకు వివాహం చేసింది. పెద్ద కుమార్తె వివాహం అయిపోగానే లక్ష్మి, కడపలోని ఎన్జీఓ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉండేది. ఈ క్రమంలో బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్న జమ్మలమడుగుకు చెందిన ఆవుల రామాంజనేయులుతో ఆమెకు పరిచయం పెరిగింది. అతనితో పాటు కూలిపనికి వెళుతూ, అతనితోనే సహజీవనం కొనసాగించింది. కొన్ని రోజుల నుంచి ఇద్దరు మనస్పర్థలతో గొడవపడేవారు. నిందితుడు ఆవుల రామాంజనేయులు ఎలాగైనా లక్ష్మి పీడ వదిలించుకోవాలని పథకం వేశాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి లక్ష్మి ఉంటున్న ఇంటికి వెళ్లి ఆమె నిద్రకు ఉపక్రమించిన సమయంలో రోకలిబండతో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఎవరికంటా పడకుండా పరారయ్యాడు. మరుసటి రోజు శనివారం రాత్రి చుట్టు పక్కల మహిళలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ రామసుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది పరిశీలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. లక్ష్మి కుమార్తె నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కాగా లక్ష్మిని దారుణంగా హత్య చేసిన నిందితుడు ఆవుల రామాంజనేయులును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వైఎస్సార్ బీమా మంజూరు



వైఎస్సార్ బీమా ఉత్తర్వు పత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని నీలకంట్రావుపేటకు చెందిన పఠాన్ గౌస్‌ఖాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. దీంతో వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షలు నిధులు మంజూరు ఉత్తర్వులను ఆదివారం బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అందజేశారు. బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ హైదర్‌వలీ, గౌస్‌మొహిద్దీన్, సర్పంచ్ అయూబ్, ఉప సర్పంచ్ రఫీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాకీర్ హుసేన్, సహదేవ పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

సంబేపల్లి : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం కారు బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్ ఎస్.జశ్వంత్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు రాయచోటికి చెందిన జశ్వంత్ కారులో కలకడకు వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనం ఒక్కసారిగా కారు వైపు దూసుకువచ్చింది. వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొనగా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

మామపై అల్లుడు కత్తితో దాడి

వేంపల్లె : స్థానిక పుల్లయ్యతోటలో నివాసముంటున్న తమ్మిశెట్టి రామ్మోహన్‌పై అల్లుడు వీరాంజనేయులు కత్తితో దాడి చేశాడు. ఆదివారం రామ్మోహన్ భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామ్మోహన్ దగ్గర పని చేసే బేల్దారితో వీరాంజనేయులు చెల్లెలు వెళ్లిపోయింది. తన మామ రామ్మోహనే వారిద్దరిని జతచేసి పంపించాడని వీరాంజనేయులుకు అనుమానం. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం రామ్మోహన్‌పై అల్లుడు వీరాంజనేయులు కత్తితో దాడికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి బాధితుడిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ చాంద్ బాషా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రుడిని పరిశీలించి, దాడికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇడుపులపాయ అడవుల్లో చిరుత సంచారం

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ సమీపంలో చిరుతపులి సంచరిస్తోంది. శనివారం రాత్రి చిరుతను గమనించిన హరిత రెస్టారెంట్ సిబ్బంది ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలం వద్దకు వెళ్లి ఆరా తీశారు. అలాగే చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సూచనలు ఇచ్చి వచ్చారు. రాత్రి సమయంలో డ్యూటీ చేస్తున్న సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నార్త్‌జోన్, నెల్లూరు జట్ల విజయం



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో తలపడుతున్న నెల్లూరు, సౌత్‌జోన్ జట్లు



62 పరుగులు చేసిన సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ ధరణికుమార్ నాయుడు



60 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ సుబ్రమణ్యం



4 వికెట్లు తీసిన సౌత్‌జోన్ బౌలర్ సంతోష్‌కుమార్



52 పరుగులు చేసిన నార్త్‌జోన్ బ్యాట్స్‌మన్ విజయ్

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో నార్త్‌జోన్, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సౌత్‌జోన్, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 40 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి సౌత్‌జోన్ జట్టు 216 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఇ. ధరణికుమార్ నాయుడు 62 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు సాకేత్ రామ్ 3, అఖిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 39.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని సుబ్రమణ్యం 60 పరుగులు, రోషన్ పవన్‌కుమార్ 40 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నార్త్‌జోన్ జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విజయనగరం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. వర్షం కారణంగా ఓవర్లు కుదించగా నిర్ణీత 28 ఓవర్లలో విజయనగరం జట్టు 28 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. జట్టులోని దుర్గాకుమార్ 40 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు సాహిల్ హుస్సేన్ 2, వంశీనారాయణ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 27 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. జట్టులోని విజయ్ 52 పరుగులు, రాహుల్ 40 పరుగులు చేశాడు. దీంతో నార్త్‌జోన్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించాల్సిన సెంట్రల్ జోన్, కృష్ణ జట్ల మ్యాచ్ రద్దయింది.

చర్చికి తాళాలు.. పోలీసులకు ఫిర్యాదు

జమ్మలమడుగు: మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో చర్చికి తాళాలు వేయడం వివాదాస్పదంగా మారింది. ఆదివారం మండల పరిధిలోని రాజీవ్‌నగర్ సమీపంలో ఉన్న సియోను ప్రార్థన మందిరానికి పాస్టర్ గండ్లూరు జోయల్ భక్త విజయం, భక్తులు ప్రార్థనలు చేసుకునేందుకు వచ్చారు. అయితే అప్పటికే చర్చి గేటుకు తాళాలు వేసి ఉండటంతో సంఘ పెద్దలు, పాస్టరు పట్టణంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను చర్చిలో ప్రార్థనలు చేసుకోకుండా కొంత మంది అడ్డుకుంటున్నారన్నారు. విచారించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో సంఘ పెద్దలు మార్కు, కుందవరపు పుష్పరాజ్, మహిళలు ఉన్నారు.



ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చిన సంఘ పెద్దలు, పాస్టర్